# * సామాన్య దంపతులు

౧

"తలుపుతియ్యి !"

"వస్తున్నా"

"(కోపంతో) ఇంకా ఎంతసేపు వస్తున్నావూ. తలుపు తియ్యఁటూవుంటేనే !"

"(తలుపుతీసి) పిల్లాడు చాటలోవున్న పిండి కింద పారపోస్తున్నాడు. అది దాచి వచ్చాను."

"ఏడవలేక పోయావు, నీ తెలివితగలడ. ఆఫీసులో చచ్చి చచ్చి ఇంటికివస్తే ఇంటిదగ్గరా మళ్ళీచావడమే... ఇక్కడ దీపమెక్కడ పెట్టావు. నన్ను చంపుకుతినేస్తున్నావునువ్వూ. బతికుండగా కాల్చేస్తున్నావు."

"దీపంవత్తి అయిపోయింది. అంచేత అది ఇక్కడికి తీసుగొచ్చి పెట్టాను."

"నీశార్ధం. దీపంవత్తి అయిపోయిందో లేదో మొదట చూసుకుని తగలడొద్దూ. నీఅమ్మ కడుపు మాడిరి. ఇలా తగలపెట్టూ ఆదీపం."

"పెడుతున్నా"

"ఏంపెడుతున్నావు, పెట్టితగలడ మంటూంటేనే. నన్ను కాల్చుకు తినడానికి పుట్టావునువ్వూ. వొద్దువొద్దోయ్ అంటూ వుంటే నిన్ను పెళ్ళిచేశాడు మానాన్న. (మంచంమీద పడుక్కుంటాడు) ప్రాణా లెగిరిపోతున్నాయి. కాళ్లు లాక్కుపోతు

*ఈ రచన 1934 లో రచించిరి.

జయలక్ష్మి ౧ వ సం. 9 వ సంచికలో (ఏప్రిల్ ను 1936)

న్నాయి. రోజూ ఇంతే రోజూ ఇంతే, అక్కడా ఇక్కడాకూడా.''

''భోజనానికి లేవండి తింటే కడుపులో చల్లగా వుంటుంది.''

''ఏడిసిన వెధవదయ ఇదోరకం కాల్చుకు తినడం కమోసు వాతమీద వేణ్ణీళ్ళు పోసినట్టు''

''భోంచెయ్యమన్నా తప్పే !''

''ఇంక నోరుమూసుకో, వొళ్లు వాయకొట్టాను.''

''దెబ్బలకేం లోటూ.''

''ఏమిటీ !''

''ఏం లేదు.''

''ఏమిటో సణుగుతున్నావులే, మహా. ఇదిగో ఇప్పుడే చెప్తున్నా. నాదగ్గిర తిన్నగా బతకదలచుకుంటే నన్నేమనొద్దు తెలిసిందా మరీ, మరీ చెబుతున్నా ఆతర్వాత నన్నేమనొద్దు.''

''ఆలాగే''

''ఏడిశావ్ !''

''(తనలో) సంధ్యవేళ అవుతూoదంటే ఒళ్ళు గజగజలాడి పోతుంది, తినడానికి పెద్దపులివస్తుందా అన్నట్టు. సాయంత్రమైతే సరి గుండెల్లో దడపుట్టుకొస్తుంది''

౨

''ఏదో ఇంత పిండాకూడు పెట్టు.''

''... ... ... ... ... ...''

''వేగిరం యేదో పడేసెయ్యి, తిని యేడుస్తా''

''వడ్డన అయింది''

''(కలుపుకుంటూ ఉంటే నెయ్యి వడ్డిస్తుంది) నెయ్యి కాచి యేడవకలేక పోయావూ ?''

''నిప్పులార్పే శాక జ్ఞాపకమొచ్చింది నెయ్యిమాట. వేడి

అన్న మేగనక వేసుగోండి.''

''ఏదో తగలెయ్యి.''

''............''

''పప్పులో ఉప్పెక్కువ పారేశావేం. నాకంత తిండి పెట్టడం కష్టంగావుంటే నేను వండనని చెప్పరాదూ. నేనివాళ భోం చెయ్యను.''

''కూచోండీ !''

''వెళ్ళి.........''

''అప్పుడే వీధిలోకే వెళ్ళి పోయారు. నాకూ ఉపోషమే ఇవాళ. మనిషి నోరెత్తితే పువ్వుల్లాంటి మాటలాడతారు. మనస్సు రాయి అయిపోతూంది. నాఖర్మమేమిటోగాని.''

3

''పిల్లాడికి శైత్య మెందుకుచేసిందీ ?''

''ఏమో !''

''నిన్న వానలో ఆడేడేమిటి ?''

''నేను చూస్తూనేఉన్నా ఆడలేదు.''

''ఆడకపోతే శైత్యమెందుకు చేసిందీ ?''

''ఏమో ! నేను బియ్యం బాగుచేసుకుంటూ ఉంటే, వాడు అవతలివేపుకి వెళ్లాడు. వెంటనే ఇంట్లోకి తీసుకొచ్చాను.''

''అదుగో అలాగ చెప్పు. నీ తెలివి తేటలు కాలినట్టే వున్నాయి, వెధవ తెలివి.''

''ఎంతకని కనిపెట్టుకుకూచోను, ఇంటి పనులు చేసుకోవాలా వద్దా ? బియ్యం బాగుచేస్తూవుంటే వాడలా పరుగెత్తుకెళ్ళాడు.''

''దరిద్రగొట్టు వెధవా యని అందుకే నే నేడుస్తున్నా.''

౪

" నేనివాళ నాటకానికి వెళ్లాలి. వేగిరం తిండిపెట్టు."

" నన్నుకూడా తీసికెళతారా ?"

" ఎవడో పెళ్ళి కెళుతూ పిల్లిని చంకనెట్టు కెళ్ళాడుట,"

" మాఊళ్ళో మాతమ్ముడు నాటకానికి తీసుకెళ్ళడమే కాని ఈఊళ్లో వెళ్లేలేదు."

" మీఊళ్లో నాటకంలాగే ఉంటుంది ఈ ఊళ్లో నాటకం కూడా."

" వెనక మీరు చూసిన నాటకాలలాగే ఉంటుంది, ఈ నాటకంకూడా."

" అలాగ మాటకి మాట అంటేనే నీబతుకు బన్దలవుతుంది."

" అయితే నోటంబడిమాటే రాకూడదేమిటి."

" నేనున్నంతసేపూ రాకూడదు. చేత్తో నోరుమూసుకుని వుండాలి.. కావలిస్తే నేను వెళ్ళాక పెంకు లెగిరిపోయేటట్లా అరువు."

" నాకేంపట్టింది అలాఅరవడానికి. నేను నింపాదిగానే మాట్లాడుతూ వుంటాను."

" అయితే నేనేనా పెంకు లెగిరిపోయేటట్లా అరుస్తూ ఉంటాను."

" నేనన్నా నేమిటి ఆమాట. మీరు చిరాకుగా గట్టిగా మాట్లాడుతూఉంటారుగాని."

" ఏదో నాకెందుకీపెధవగోల, ఏదోపడేసెయ్యి, నోరుమూసుగు తిని పోతాను."

" (తనలో) సరసంగా మాట్లాడితే కొట్టొస్తారమ్మా నాబతుకాలా."

౫

" ఇందాకల్లా ఎవరూ మీకోసం వచ్చారు ?"

" మనుష్యులే, రాక్షసులుకాదు."

" ఊరికే అడుగుతున్నా ఎవరని."

" యమధర్మరాజు."

"....................."

" నేనలాగు పోవాలి తలుపు వేసుగో."

" ఎక్కడికి వెళతారు."

" ఎక్కడికెళితే నీకెందుకూ, తిరిగి వస్తానో రానోఅనా. తిరిగిరాకపోతేనే సుఖంగాఉంటుంది నీకు.

౬

" అద్దం ఎందుకూ బద్దలయిందీ."

"....................."

" చెప్పూ చెప్పవేం."

"....................."

" చెప్తావా చెప్పవా ?"

" పిల్లవాడు చేతిలోదిలాక్కునికిందపడేశాడు"

" పిల్లవాడికద్దమెందుకిచ్చావు ?"

" నేనియ్యలేదు."

" నేను తల దువ్వుకుంటూఉంటే వాడు తీసుకుని "ఇచ్చేసెయ్యి" అంటూ ఉంటే కిందపడేశాడు."

" ఇంతపనికిమాలిన దానివయితే నువ్వెందుకు పనికొస్తావు."

౭

" ఇక్కడపెట్టుకున్న అరటిపళ్ళు ఎవరు తీశారు ?"

" నేను."

" ఏంచేశావు. "

" అదిగో ఆరింట్లోనూ వొకటి తిన్నాను. తక్కినఅయిదూ ఇక్కడ దాచాను. "

" నేను అసలు నిన్ను ఆపళ్లు ముట్టుగోమన్నానా ? "

" ... ... ... ... "

"చెప్పూ, చెప్పవేం."

."లేదు."

"మొదటి తప్పు నన్నడగకుండా పళ్ళు ముట్టుకోడం. రెండో తప్పు నేను నాకోసమని తెచ్చుకొన్న పళ్ళు తినేసెయ్యడం."

"అదిగో అయిదు పళ్ళున్నాయి."

"అయిదు పళ్ళున్నాయి. నువ్వూడున్నావు. నేను తిందామని ఆప్యాయంగా తెచ్చుకొన్నపళ్లు నువ్వెందుకు తినేశావు?"

"నాకు తెలియలేదు మీరుతిందామని తెచ్చుకున్నారని"

"నేను చచ్చాక తెలుస్తుందాయేమిటి నీకు" (కొడతాడు)

౭

"ఇదిగో బజారుకెళుతున్నా. నీకేమేనా కావాలేమోచెప్పు కొనితెస్తా."

"నాకేమక్కర్లేదు"

"అయినా చెప్పు, కొనితెస్తా."

"నాకక్కర్లేందే."

"నేనుముచ్చటగా అడుగుతున్నా, కొనితెస్తా చెప్పు."

"తర్వాతనన్ను దెప్పి చంపడానికి, నాకేమీ అక్కర్లేదో యంటూఉంటేనే."

"నీఖర్మం నేనేంచేసేది. వెనకేదో రవికెలగుడ్డ కావాలన్నావు కాదూ."

"నాకు కావాలసినన్ని రవికెలున్నాయి. అక్కర్లేదు."

"నువ్వు కొయ్యపోతుమనిషివి. నిన్నుఅడగడం నాదే బుద్ధి పొరపాటు. లెంపలువాయించుకుంటున్నా. (లెంపలు వాయించుకొని వెళిపోతాడు.)

# అన్యోన్య దంపతులు

## ౧

" ఓయ్ ! తలుపుతియ్యి !"

" వచ్చె "

" ... ... ... ... "

" (తలుపుతీసి) పిల్లాడు చాటలోపిండి కిందపారపోస్తున్నాడు. అదితీసి దాచివచ్చాను."

" అంత పెంకితనం చేస్తున్నాడూ! "

" అంతా యింతానా! "

" అయితే శిక్ష వేస్తాను. "

" ఏం శిక్ష వేస్తారు ? "

" చూద్దూగానిగా. "

" అయినా చెప్పండి "

" వాడిచేత నిన్ను నాలుగు తన్నిస్తాను. "

" మంచిశిక్షే ! పోనీ మీరు తినండి. "

" నేనుతిన్నా నువ్వుతిన్నా ఒకటేగా ! "

" అంచేతే మీరుతినడం. "